అక్షరశక్తి
The Power of Pen
Evening Daily

## మహిళా ఉద్యోగిపై వేధింపులు!

- కేయూ హాస్టల్ సూపరింటెండెంట్‌పై రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు
- నిష్పక్షపాతంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్

కాకతీయ యూనివర్సిటీ హాస్టల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మహిళా ఉద్యోగి, హాస్టల్ సూపరింటెండెంట్ బీ. చంద్ర మోహన్ రాజ్‌పై వేధింపుల ఆరోపణలు చేస్తూ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. - అక్షరశక్తి,కేయూ క్యాంపస్



5

సంపుటి: 20 | సంచిక: 288 | వరంగల్ | గురువారం, 20 ఆగస్టు 2026 | పేజీలు: 07

# సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం!

**రాజకీయంగా బాధ్యత వహించాలనడం సరికాదు**

## నన్ను బాధ్యురాలిగా చేయడం సహజ న్యాయ స్ఫూర్తికి విరుద్ధం

- పార్టీ క్రమశిక్షణా నియమావళిపై సంపూర్ణ గౌరవం ఉంది
- నాకు జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలి
- టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి కొండా సురేఖ లేఖ





6

తన కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగతమని తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. గురువారం టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి ఆమె లేఖ రాశారు. ఈ సందర్భంగా తన కుమార్తె చేసిన వ్యాఖ్యలపై ఆ లేఖలో మంత్రి కొండా సురేఖ వివరణ ఇచ్చారు. తన కుమార్తె అయినంత మాత్రాన.. ఆమె వ్యక్తిగత అభిప్రాయాలకు మరొకరు రాజకీయంగా బాధ్యత వహించాలనడం సముచితం కాదని స్పష్టం చేశారు. సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిగా చేయడం సహజ న్యాయ స్ఫూర్తికి విరుద్ధమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై, పార్టీ క్రమశిక్షణా నియమావళిపై తనకు సంపూర్ణ గౌరవం ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలు, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఈ అంశంలో తన ప్రమేయం లేదని గుర్తించాలని కమిటీకి ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో తనకు జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని ఈ సందర్భంగా క్రమశిక్షణా కమిటీని మంత్రి కొండా సురేఖ కోరారు.

- అక్షరశక్తి, హైదరాబాద్



# గాడి తప్పిన గస్తీ..!

## మళ్లీ అర్ధరాత్రి దొంగతనాలు



నగరంలోని మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుస చోరీలు, నేర ఘటనలు చోటుచేసుకుంటుండటంతో స్థానికుల్లో భయాందోళన నెలకొంది. రాత్రివేళల్లో ఇటీవల పలు ఇండ్లలో చోరీలు జరుగడం వంటి ఘటనలు పెరిగాయి.

- అక్షరశక్తి, వరంగల్

4

# నీతల్లి తలదించుకునే పరిస్థితి తెచ్చావు...

## సుస్మిత వ్యాఖ్యలకు ఇందిరా శోభన్ కౌంటర్



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకురాలు ఇందిరా శోభన్ తీవ్రస్థాయిలో స్పందించారు. సుస్మిత తన స్థాయిని మించి మాట్లాడుతున్నారని, పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తూ ముఖ్యమంత్రిని విమర్శించే హక్కు ఆమెకు ఎవరిచ్చారని ప్రశ్నించారు.

- అక్షరశక్తి,హైదరాబాద్

3

## ఆయుష్ స్టైపెండ్ పెంపు కోసం 17 రోజులుగా సమ్మె



**అక్షరశక్తి, హైద్రాబాద్:** తెలంగాణలో ఆయుష్ విద్యార్థులు, ఇంటర్న్లు, హౌస్ సర్జన్లు, పీజీ వైద్యులు స్టైపెండ్ పెంపు కోసం గత 17 రోజులుగా నిరవధిక శాంతియుత సమ్మె నిర్వహిస్తున్నారు. దాదాపు పదేళ్లుగా స్టైపెండ్లు పెరగక పోవడంతో జీవన, విద్యా, హాస్టల్ ఖర్చులు పెరిగినా తమకు న్యాయం జరగడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో AYUSH వైద్యులకు అల్లోపతి వైద్యులతో సమానంగా స్టైపెండ్ అందుతున్న నేపథ్యంలో తెలంగాణ లోనూ సమానత్వం పాటించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వానికి పలు మార్లు వినతిపత్రాలు, పోస్టుకార్డు ఉద్యమం, నల్ల బ్యాడ్జీలు, ధర్నాలు తదితర ప్రజాస్వామ్య పద్ధతుల్లో సమస్యను వివరించినా స్పష్టమైన ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడకపోవడంతో ఆగస్టు 4 నుంచి సమ్మెకు దిగినట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయని, 10 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న స్టైపెండ్ పెంపును వెంటనే అమలు చేస్తూ స్పష్టమైన జీవో జారీ చేయాలని తెలంగాణ AYUSH హౌస్ సర్జన్లు, పీజీ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రభుత్వాన్ని కోరుతోంది.

## రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఘన నివాళులు



**అక్షరశక్తి, హనుమకొండ:** భారతరత్న, మాజీ ప్రధాని, ఆధునిక భారత నిర్మాత స్వర్గీయ రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సాంకేతిక, విద్య, టెలికమ్యూనికేషన్, గ్రామీణాభివృద్ధి రంగాల్లో రాజీవ్‌గాంధీ తీసుకొచ్చిన సంస్కరణలు దేశ ప్రగతికి బలమైన పునాది వేశాయని అన్నారు. 18 ఏళ్లకే ఓటు హక్కు, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు వంటి నిర్ణయాలు ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేశాయని పేర్కొన్నారు. రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని దేశంలో శాంతి, సౌభ్రాతృత్వం, మత సామరస్యం, ఐక్యతను పెంపొందించాలనే సందేశంతో సద్భావనా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. "సమైక్యతే మన శక్తి-సద్భావనే మన ప్రగతి" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ 45వ డివిజన్ అధ్యక్షుడు కర్ర హరీష్‌రెడ్డి, 44వ డివిజన్ అధ్యక్షుడు జక్కుల సదానందం, జిల్లా కార్యదర్శి పుల్యాల యాదవ్‌రెడ్డి, మాజీ పాక్స్ చైర్మన్ గంగుల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ డివిజన్ అధ్యక్షులు సట్ల సదానందం గౌడ్, రాజారపు స్వామి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంద రమేష్, జిల్లా బీసీ సెల్ నాయకుడు గంగపురం వేణుగౌడ్, మహిళా డివిజన్ అధ్యక్షులు నర్మెట కృష్ణవేణి, ప్రశాంతి, వర్ధన్నపేట యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బస్కె ప్రణయ్, మండల యూత్ అధ్యక్షుడు బోగి కృష్ణ, దాసరి కార్తీక్, డివిజన్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ బొందుగుల సతీష్, గ్రామ శాఖ అధ్యక్షులు ఎండి బషీర్, మాతంగి రవి, దడబోయిన రాజు యాదవ్, సీనియర్ నాయకులు వేణు యాదవ్, ఐరబోయిన స్వామి, మాచర్ల కృష్ణమూర్తి, బైరి విశ్వనాథం, నక్కల యాదగిరి, దుబ్బాక మోహన్, రాజశేఖర్, ఆరూరి పరమేష్, పులి తదితరులు, యూత్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేశవాపూర్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం

### మంత్రి పొన్నం ప్రభాకర్



**అక్షరశక్తి,హనుమకొండ:** ఎల్కతుర్తి మండలం కేశవాపూర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. "పల్లె పల్లెకు పొన్నం అన్న-పల్లె పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రామంలో పర్యటించిన ఆయన గ్రామ పంచాయతీ వద్ద ప్రజలు, రైతుల నుంచి వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామంలో అమలైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించారు.

కేశవాపూర్‌లో 506 మందికి పెన్షన్లు, 526 కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 630 కుటుంబాలకు గ్యాస్ సబ్సిడీ అందుతున్నాయని మంత్రి తెలిపారు. 5,486 మంది రైతులకు రైతు భరోసా కింద రూ.5.03 కోట్లు, 447 మంది రైతులకు రూ.3.91 కోట్ల రుణమాఫీ, 192 మంది రైతులకు రూ.44.82 లక్షల సన్నవడ్ల బోనస్ అందించామని వివరించారు. మొదటి దశలో 22 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, రెండో దశలో మరిన్ని ఇళ్లకు త్వరలో అనుమతులు ఇస్తామని చెప్పారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, బ్యాంకు రుణాలు, కొత్త రేషన్ కార్డులు, భూ భారతి దరఖాస్తుల పరిష్కారం తదితర సంక్షేమ ప్రయోజనాలు అందుతున్నాయని పేర్కొన్నారు.

గ్రామస్థులు కేశవాపూర్ నుంచి గూడూరు, అంబాల, పెంబర్తి గ్రామాలకు రహదారులు, ఎస్సీ కాలనీ వరకు సీసీ రోడ్డు, పెద్దమ్మ గుడి నుంచి చర్చి వరకు రోడ్డు, చెరువులకు బౌండరీ, నందిపయ్య కాలువ పునరుద్ధరణ, బైపాస్ రోడ్డు పునరుద్ధరణ తదితర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. గుంటూరు పల్లె నుంచి కేశవాపూర్ వరకు రూ.3.5 కోట్లతో రహదారి పనులు మంజూరయ్యాయని, కేశవాపూర్-అంబాల-పెంబర్తి రహదారి, శివాలయ అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. తక్కువ వర్షపాతం నేపథ్యంలో నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని, ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు, బోర్ ఇంజెక్షన్ పాయింట్లు, వాటర్ పిట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ఎల్కతుర్తి మండలంలో కేశవాపూర్‌ను సోలార్ మోడల్ విలేజ్‌గా ఎంపిక చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రతి ఇంటికి సోలార్ విద్యుత్, సోలార్ పంపులు ఏర్పాటు చేసి అదనపు విద్యుత్‌ను విక్రయించుకునే అవకాశం కల్పిస్తామని చెప్పారు. గ్రామంలో 300 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపడితే రూ.10 లక్షలు మంజూరు చేస్తానని, సబ్ మార్కెట్ యార్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో బీసీ మహిళలకు 1,000 కుట్టు మిషన్లు అందిస్తున్నామని, మహిళా సంఘాలకు స్టీల్ సామగ్రి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్యం, విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోత్కుపల్లి శ్రీకాంత్ రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఫోటోగ్రఫీలో తడండ్ల శ్రావణ్‌కు వరుస పురస్కారాలు








**అక్షరశక్తి,ములుగు:** పాలంపేట (రామప్ప) గ్రామానికి చెందిన ఫోటోగ్రాఫర్ తడండ్ల శ్రావణ్ ఫోటోగ్రఫీ రంగంలో వరుస పురస్కారాలు సాధిస్తూ జిల్లాకు గుర్తింపు తీసుకొస్తున్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా జమ్మికుంట ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో వెడ్డింగ్, తెలంగాణ సంస్కృతి, ప్రీవెడ్డింగ్ విభాగాల్లో పోటీ పడి ప్రథమ బహుమతి సాధించారు. జమ్మికుంటలో జరిగిన కార్యక్రమంలో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తదితరుల చేతుల మీదుగా రూ.10 వేల నగదు బహుమతి, మెమెంటో అందుకున్నారు. అదేవిధంగా హైదరాబాద్‌లో రిఫ్టీ ఫిల్మ్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన RIFTI Black & White Photography Contest-2026లో దేశవ్యాప్తంగా పాల్గొన్న ఫోటోగ్రాఫర్లతో పోటీ పడి శ్రావణ్ ద్వితీయ బహుమతి సాధించారు. 'Simple. Powerful. Timeless.' అనే థీమ్‌తో నిర్వహించిన ఈ పోటీలో పర్యావరణం, డాక్యుమెంటరీ, సంస్కృతి, నిత్యజీవితం, స్ట్రీట్ ఫోటోగ్రఫీ, ల్యాండ్‌స్కేప్, ఫోటో జర్నలిజం తదితర విభాగాలు ఉన్నాయి. శ్రావణ్‌కు రూ.5 వేల నగదు పురస్కారాన్ని ప్రముఖ సినిమాటోగ్రాఫర్ ఎం.వి. రఘు, రిఫ్టీ ఫిల్మ్స్ సీఈఓ మైక్, డీన్ ప్రియా రాథోడ్ చేతుల మీదుగా అందించారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఖమ్మం ఫోటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ సహకారంతో నిర్వహించిన ఫోటోగ్రఫీ పోటీలోనూ శ్రావణ్ సమర్పించిన 'జాయ్ ఆఫ్ సింప్లిసిటీ' ఛాయాచిత్రానికి ఉత్తమ నగదు బహుమతి లభించింది. అదనపు డీసీపీ బొజ్జా రామానుజన్ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు.



ప్రకృతి, పల్లె జీవనం, సంస్కృతి, సంప్రదాయాలు, మనుషుల జీవితాలను తన కెమెరా ద్వారా ప్రత్యేకంగా ఆవిష్కరిస్తున్న శ్రావణ్ ఇప్పటికే పలు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో గుర్తింపు పొందారు. "ప్రతి ఫ్రేమ్‌కు ఒక కథ ఉంటుంది. ఆ కథను ప్రత్యేకంగా చూపించడమే నా లక్ష్యం. ఈ పురస్కారాలు మరింత మంచి చిత్రాలు తీయాలనే ప్రోత్సాహాన్ని ఇచ్చాయి" అని శ్రావణ్ తెలిపారు.

# నీతల్లి తలదించుకునే పరిస్థితి తెచ్చావు

- సుస్మిత వ్యాఖ్యలకు ఇందిరా శోభన్ కౌంటర్



**అక్షరశక్తి,హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకురాలు ఇందిరా శోభన్ తీవ్రస్థాయిలో స్పందించారు. సుస్మిత తన స్థాయిని మించి మాట్లాడుతున్నారని, పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తూ ముఖ్యమంత్రిని విమర్శించే హక్కు ఆమెకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. పేరుకు ముందు కొండా అనే పేరు లేకపోతే అసలు నువ్వు ఎవరు సుస్మిత? సినిమా డైలాగులు కొట్టడం సులభమే.. కానీ ఆ తర్వాత జరిగే పరిణామాలను ఎదుర్కోవడం కష్టం అంటూ ఇందిరా శోభన్ ఘాటుగా వ్యాఖ్యానించారు. తల్లిదండ్రుల చాటున రాజకీయాలు చేస్తూ ముఖ్యమంత్రిని విమర్శించడం సరికాదని అన్నారు. సుస్మిత వ్యాఖ్యల వల్ల ఆమె తల్లి, మంత్రి కొండా సురేఖ సైతం తలదించుకునే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. "మీ తల్లికి మంత్రి పదవి ఉంటే మీ అందరికీ ఉన్నట్లే కదా? మీ జాతికి మొత్తం ఉన్నట్లే కదా?" అంటూ ఇందిరా శోభన్ ప్రశ్నించారు. పొద్దున లేస్తే సీఎం కుటుంబ సభ్యులను ఎందుకు విమర్శిస్తున్నావని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీపై, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై నోటికొచ్చినట్లు మాట్లాడితే కాంగ్రెస్ కార్యకర్తలు, రేవంత్ అభిమానులు ఊరుకోరని హెచ్చరించారు. కాంగ్రెస్‌లో ఉంటూ పార్టీ నాయకత్వానికి వ్యతిరేకంగా బహిరంగ వ్యాఖ్యలు చేయడం తగదని ఇందిరా శోభన్ హితవు పలికారు. పార్టీ నిర్ణయాలు, క్రమశిక్షణను గౌరవించాలని సూచించారు. సుస్మిత వ్యాఖ్యల నేపథ్యంలో కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలపై రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ కొనసాగుతోంది.

# కాంగ్రెస్ కార్యాలయంలో రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలు



**అక్షరశక్తి,హన్మకొండ:** మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలను జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి నేతృత్వంలో డీసీసీ కార్యాలయం, ఎంజీఎం సెంటర్‌లో జరిగిన కార్యక్రమాల్లో రాజీవ్ గాంధీ చిత్రపటానికి, విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అయ్యూబ్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, టీపీసీసీ మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ మేయర్ గుండు సుధారాణి, మాజీ ఎమ్మెల్సీ పుల్లా పద్మావతి, మార్కెట్ ఛైర్మన్ పులి ప్రియాంక, ఐవైసీ జాతీయ కార్యదర్శి సాగరిక రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ 21వ శతాబ్దపు ఆధునిక భారత నిర్మాణానికి, దేశంలో సాంకేతిక, ఐటీ, టెలికాం, కంప్యూటర్ విప్లవానికి రాజీవ్ గాంధీ బీజం వేశారని కొనియాడారు. రాజీవ్ గాంధీ జన్మదినాన్ని దేశవ్యాప్తంగా 'సద్భావనా దివస్'గా నిర్వహిస్తూ శాంతి, ఐక్యత, మతసామరస్యాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కేవలం 40 ఏళ్ల వయస్సులోనే ప్రధానమంత్రి బాధ్యతలు చేపట్టి దేశాన్ని ఆధునిక దేశాల సరసన నిలబెట్టేందుకు రాజీవ్ గాంధీ విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. యువత రాజకీయాల్లో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించడం, పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారా అధికారాలను గ్రామస్థాయికి వికేంద్రీకరించడం, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లకు పునాది వేయడం వంటి కీలక నిర్ణయాల్లో రాజీవ్ గాంధీ పాత్ర మరువలేనిదని ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అన్నారు. దేశ ఐక్యత, మతసామరస్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహానేత ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ శ్రేణులంతా కట్టుబడి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# ముదిరాజుల ఐక్యతకు తొలిమెట్టు

- అధికారికంగా పండుగ సాయన్న జయంతి, వర్ధంతి
- పీఆర్ ముదిరాజ్ సేవా సమితి హర్షం

**అక్షరశక్తి, హనుమకొండ:** తెలంగాణలో ముదిరాజ్ సమాజం ఐక్యతకు పండుగ సాయన్న జయంతి, వర్ధంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం చారిత్రాత్మక తొలి అడుగుగా నిలిచిందని పీఆర్ ముదిరాజ్ సేవా సమితి పేర్కొంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పండుగ సాయన్న జయంతిని అక్టోబర్ 22న, వర్ధంతిని డిసెంబర్ 10న అధికారికంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని నిర్ణయించడంపై హర్షం వ్యక్తం చేసింది. ఈ నిర్ణయం సమన్వయంతో సాధించిన సమిష్టి విజయమని, ముదిరాజ్ సమన్వయ కమిటీతో పాటు రాష్ట్రంలోని వివిధ ముదిరాజ్ సంఘాలు పండుగ సాయన్న చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేసిన కృషి ఫలితమేనని తెలిపింది. మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్



పీఆర్ ముదిరాజ్ సేవా సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు పెసరు రాజన్న ముదిరాజ్

ఆధ్వర్యంలో బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నీలం మధు ముదిరాజ్, డాక్టర్ బండ ప్రకాష్ ముదిరాజ్, ఈటెల రాజేందర్ ముదిరాజ్, కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ తదితరులు సమన్వయంతో పనిచేశారని పేర్కొంది. 174 సంవత్సరాలుగా చరిత్రలో మరుగునపడిన ప్రజావీరుడు పండుగ సాయన్నకు అధికారిక గుర్తింపు లభించడం ముదిరాజ్ సమాజానికి గర్వకారణమని పీఆర్ ముదిరాజ్ సేవా సమితి తెలిపింది. పేదలు, అణగారిన వర్గాల కోసం పోరాడిన పండుగ సాయన్నకు ప్రభుత్వం అధికారిక గౌరవం కల్పించడం చారిత్రాత్మక పరిణామమని పేర్కొంది. జయంతి, వర్ధంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించేలా నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపింది. అలాగే కాసాని జ్ఞానేశ్వర్, బండా ప్రకాష్, ఈటెల రాజేందర్, నీలం మధు, కాసాని వీరేశ్ తదితరులు, ముదిరాజ్ సమన్వయ కమిటీ సభ్యులు, వివిధ సంఘాల నాయకులకు ధన్యవాదాలు తెలిపింది.

# బాబా మందిరంలో ఫోటో జర్నలిస్టులకు ఘన సన్మానం



**అక్షరశక్తి,హనుమకొండ:** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ సాయిబాబా మందిరంలో ప్రింట్ మీడియా ఫోటో జర్నలిస్టులను ఘనంగా సన్మానించారు. మందిర చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్ సమక్షంలో గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఫోటో జర్నలిస్టులు గోకారపు శ్యామ్, వీరగోని హరీష్, సంపేట సుధాకర్, చేతి శ్రీనివాస్, సంపేట వెంకటేశ్వర్లు, గొట్టె వెంకన్న, హిందూ మురళి, కుడుతల రమేష్‌లకు పూజారి చందు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మందిర సెక్రటరీ వెయ్యిగండ్ల రమేష్, ధర్మకర్త, పీఆర్వో నిమ్మల శ్రీనివాస్‌లు ఫోటో జర్నలిస్టులను బాబా శేష వస్త్రాలతో సన్మానించి ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్ మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్లు సాయినాథుని ఆశీస్సులతో తమ వృత్తిలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సమాజంలో జరిగే ప్రతి ముఖ్య ఘటనను తమ కెమెరాల ద్వారా ప్రజలకు చేరవేస్తున్న ఫోటో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ధర్మకర్త, పీఆర్వో నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా సాయిబాబా మందిరంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో ఫోటో జర్నలిస్టుల సేవలు మరువలేనివని పేర్కొన్నారు. వారి సేవలను గుర్తించి ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మందిర సిబ్బంది సాయికృష్ణ, రాజు, ఫోటో జర్నలిస్టులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఠంయ్యాల శ్రీధరాచార్యులకు ఎస్. జానకి స్ఫూర్తి పురస్కారం






**అక్షరశక్తి,వరంగల్:** ప్రముఖ వ్యాఖ్యాత, గాయకుడు, తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ఎల్‌బీనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మాసూమ్ అలీలో తెలుగు ఉపాధ్యాయుడైన ఠంయ్యాల శ్రీధరాచార్యులను శృతి లయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఎస్. జానకి స్ఫూర్తి పురస్కారంతో సత్కరించారు. చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో జరిగిన కార్యక్రమంలో గాయనీ గాయకులు ఎస్. జానకి ఆలపించిన మధుర గీతాలను ఆలపించారు. కార్యక్రమానికి ప్రముఖ సంఖ్యాశాస్త్ర, జ్యోతిష్య నిపుణులు దైవజ్ఞ శర్మ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ, ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్‌చైర్మన్ జి. చిన్నారెడ్డి పాల్గొన్నారు. డాక్టర్ వంశీ రామరాజు, కుసుమ భోగరాజు, శ్రీమణి, గంగా ప్రసాద్, ముత్యాల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఠంయ్యాల శ్రీధరాచార్యులతో పాటు విజయలక్ష్మి శర్మ, వింజమూరి కృష్ణ, గంగారం తదితరులకు పురస్కారాలు అందజేశారు. ఆమని, సుభాష్, కృష్ణ ప్రసాద్, అంజనేయ శాస్త్రి, శ్రీకాంత్ చారి, అరుణ, శ్రీరాణి, సుజాత, అజయ్, జగన్, వినయ్ బాబు, శ్రీధరాచార్యులు, గాంధీ తదితరులు గీతాలు ఆలపించారు.

## "ప్రతి వర్షపు చుక్కను ఒడిసి పట్టాలి"

**రతన్ సింగ్ ఠాకూర్, కోడిమాల శ్రీనివాసరావు.**






**అక్షరశక్తి,వరంగల్:** యూత్ ఫర్ సొసైటీ ఆధ్వర్యంలో "రైన్ వాటర్ హార్వెస్టింగ్ "పై అవగాహన కార్యక్రమం ర్యాలీ నిర్వహించడం జరిగినది. గోపాలస్వామి గుడి దగ్గర నుండి పోచమ్మ మైదాన్ చౌరస్తా వరకు సాగిన ఈ కార్యక్రమానికి ముఖ్య యూత్ ఫర్ సొసైటీ ఫౌండర్ కొడిమాల శ్రీనివాసరావు మరియు ప్రముఖ పర్యావరణ వేత్త ప్రొఫెసర్ రతన్ సింగ్ ఠాకూర్ విచ్చేసి ర్యాలీని ప్రారంభించారు. ప్రస్తుత వాతావరణ లెనీనో ప్రభావంతో నడుస్తున్నదని దీనివల్ల వర్షపాతం సాధారణ కంటే తక్కువ ఎండలు ఎక్కువగా ముఖ్యంగా నీటి కొరత ఏర్పడుతుందని కావున ప్రతి వర్షపు చుక్కను ఓడిసిపట్టి భూగర్భ జలాలను పెంచుకొని భవిష్యత్తులో నీటి కొరత రాకుండా చూడాలని దీనికోసం ప్రతి ఒక్కరూ తమ తమ ఇంటి లోపల ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకొని ఇంటి పైన పడే ప్రతి వర్షపు చుక్కను ఇంకుడు గుంటలో చేరే విధంగా చేసుకొని భూగర్భ జలాలను పెంచుకొని నీటి కొరతను నివారించవచ్చు అని అన్నారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేషన్ అధికారులు ప్రతి ఇంటి నిర్మాణంలో ఇంకుడు గుంట ఉంటేనే పర్మిషన్ అనే నిబంధనలు ఉన్నాయని దీని తప్పక పాటించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా యూత్ ఫర్ సొసైటీ బాధ్యులు తమ తమ ప్రాంతా లలో, వార్డులలో ప్రజలకు వర్షపు చుక్క ఒడిసి పట్టే విధంగా చైతన్య కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ సొసైటీ వరంగల్ బాధ్యులు దేవిశ్రీప్రసాద్, మొహమ్మద్ ఫయాజ్ ,సాకేత్ ఆధ్వర్యంలో వివిధ కళాశాల నుండి వాలంటీర్లు రుత్విక్ ,విష్ణు, దుర్గ ప్రసాద్, నీరజ్ , రోహిత్ ,దీక్షిత్, నవీన్, సూర్య ,అప్నాన్, రాఘవ నవదీప్, ఆరిఫ్, యాసీన్ మరియు సాయి సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ట్స్ కళాశాలతో టాస్క్ ఒప్పందం

**అక్షరశక్తి,హనుమకొండ:** విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్)తో హనుమకొండ సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు గురువారం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతికి టాస్క్ జిల్లా అభివృద్ధి అధికారి రామకృష్ణ మామిడాల అవగాహన ఒప్పంద పత్రాన్ని అందజేశారు. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలపై అవగాహన, ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి మాట్లాడుతూ, ప్రస్తుత ఉద్యోగ మార్కెట్‌కు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. టాస్క్‌తో కుదిరిన ఈ ఒప్పందం విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల టాస్క్ సంచాలకులు డాక్టర్ గిరిప్రసాద్, సహాయ రిజిస్ట్రార్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



# గాడి తప్పిన గస్తీ...!

### మళ్లీ అర్ధరాత్రి దొంగతనాలు

**అక్షరశక్తి, వరంగల్:** నగరంలోని మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుస చోరీలు, నేర ఘటనలు చోటుచేసుకుంటుండటంతో స్థానికుల్లో భయాందోళన నెలకొంది. రాత్రివేళల్లో ఇటీవల పలు ఇండ్లలో చోరీలు జరుగడం వంటి ఘటనలు పెరిగాయి.
వరుస దొంగతనాల కారణంగా ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లాలన్నా ప్రజలు ఆందోళన చెందుతున్నారు.
పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రాత్రివేళల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నారన్న ప్రచారం స్థానికులను కలవరపెడుతోంది. పోలీసుల రికార్డుల్లో ఉన్న రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. అనుమానాస్పద వ్యక్తులను తనిఖీ చేయడంతో పాటు సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దొంగతనాలు, దోపిడీలతో పాటు ఇతర హింసాత్మక ఘటనలు కూడా చోటు చేసుకుంటున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రధాన రహదారులతో పాటు కాలనీలు, నిర్మానుష్య ప్రాంతాల్లో రాత్రి గస్తీని పెంచాలని, బీట్ కానిస్టేబుళ్ల వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని స్థానికులు కోరుతున్నారు. నేరాలకు పాల్పడే వ్యక్తులపై ముందస్తు నిఘా పెట్టడం ద్వారా ఘటనలను అడ్డుకోవచ్చని పేర్కొంటున్నారు.
మిల్స్ కాలనీ పరిధిలో వరుసగా జరుగుతున్న నేర ఘటనలపై పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. రాత్రి వేళల్లో ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహించడంతో పాటు వాహనాల తనిఖీలు, అనుమానితుల కదలికలపై నిఘా, సమస్యాత్మక ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజలకు భద్రతపై నమ్మకం కలిగేలా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం



**అక్షరశక్తి,కాజీపేట:** కడిపికొండ, బొడ్రాయి సెంటర్‌లోని 44, 45 డివిజన్లలో మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొడ్రాయి కూడలిలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు నర్మెట వెంకటరమణ గౌడ్, కట్కూరి రమేశ్, బస్కె కృష్ణ, అబ్దుల్ సమ్మద్, ఆకారపు శివాజీ, పైడిపాల శ్రీనివాస్, బస్కె రవి, నర్మెట సుధాకర్, బత్తిని విజయగిరి, బుర్ర మధు, నర్మెట వేణుగోపాల్ గౌడ్, దామెరుప్పల కోటేశ్వర్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం దేశానికి రాజీవ్ గాంధీ చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నర్మెట వెంకటరమణ గౌడ్ మాట్లాడుతూ, ఆధునిక భారత నిర్మాణం, సాంకేతిక అభివృద్ధి, యువతకు అవకాశాల కల్పనలో రాజీవ్ గాంధీ కీలక పాత్ర పోషించారని అన్నారు. దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకెళ్లాలనే దూరదృష్టితో ఆయన తీసుకున్న నిర్ణయాలు నేటికీ భారత ప్రగతికి పునాదులుగా నిలిచాయని పేర్కొన్నారు. 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించడం, పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా యువత, గ్రామీణ ప్రజలకు పాలనలో భాగస్వామ్యం కల్పించారని తెలిపారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన రాజీవ్ గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అని, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయన చూపిన మార్గంలో నడుస్తూ ప్రజా సంక్షేమానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# ఆత్మకూరులో ప్రతిష్టాత్మక టౌన్‌షిప్





- ఆధునిక వసతులతో అన్ని హంగులు
- ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన

**అక్షరశక్తి,ఆత్మకూరు:** హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రతిష్టాత్మక టౌన్‌షిప్ అండ్ ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గత ఆదివారం శంకుస్థాపన చేశారు. ఆత్మకూరులో 29.08 ఎకరాల విస్తీర్ణంలో చేపడుతున్న ఈ టౌన్‌షిప్‌ను అత్యాధునిక మౌలిక వసతులతో అభివృద్ధి చేయనున్నారు. వరంగల్ మహానగర భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రణాళిక రూపొందించి, ఆదర్శవంతమైన నమూనా టౌన్‌షిప్‌గా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రాజెక్టులో విశాలమైన రహదారులు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, నిరంతర విద్యుత్ సరఫరా, ఆధునిక పార్కులు, కమ్యూనిటీ వసతులు వంటి సదుపాయాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రత్యేక వసతులతో నిర్మాణం కానున్న ఈ టౌన్‌షిప్ ఆత్మకూరు కే కాకుండా ఓరుగల్లు మహా నగరానికి ఒక కొత్త దిశను చూపనుంది. ఈ టౌన్‌షిప్ అభివృద్ధితో ఆత్మకూరు ప్రాంతంతో పాటు వరంగల్ నగర శివారు ప్రాంతాల రూపురేఖలు మారనున్నాయని అధికారులు తెలిపారు. శంకుస్థాపన కార్యక్రమానికి రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రులు దనసరి సీతక్క, అడ్లూరి లక్ష్మణ్, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తదితరులు హాజరయ్యారు.

# మహిళా ఉద్యోగిపై వేధింపులు!

- కేయూ హాస్టల్ సూపరింటెండెంట్‌పై రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు
- నిష్పక్షపాతంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్



**అక్షరశక్తి,కేయూ క్యాంపస్:** కాకతీయ యూనివర్సిటీ హాస్టల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మహిళా ఉద్యోగి, హాస్టల్ సూపరింటెండెంట్ బీ. చంద్ర మోహన్ రాజ్‌పై వేధింపుల ఆరోపణలు చేస్తూ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. విధులు నిర్వహించే సమయంలో తనను అవమానకరంగా, అసభ్యకరంగా మాట్లాడటంతో పాటు కించపరిచే పదజాలం ఉపయోగిస్తున్నారని ఆమె ఆరోపించినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై అధికారికంగా విచారణ జరిపించాలని ఆమె కోరినట్లు తెలుస్తోంది.

**కార్యాలయంలోనే వేధింపులు...**

ఈ నెల 17న ఉదయం కార్యాలయానికి వెళ్లి పలకరించిన సమయంలో తనను దూషిస్తూ అవమానకరమైన పదాలు ఉపయోగించారని, గతంలోనూ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. అలాగే 17వ తేదీ రాత్రి సుమారు 9.30 గంటలకు కార్యాలయ ఉద్యోగి ద్వారా సూపరింటెండెంట్ ఆఫీసుకు రావాలని పిలిపించారని, రాత్రి వేళల్లో విధులకు రావాల్సిన పరిస్థితులు పలుమార్లు ఏర్పడ్డాయని ఆమె ఆరోపించినట్లు తెలుస్తోంది. తనను "ఒంటరి ఆడదాని" వంటి పదాలతో అవమానించడంతో తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నానని మహిళా ఉద్యోగి పేర్కొన్నట్లు సమాచారం. ఆరోపణలు ఒకే ఘటనకు పరిమితం కాకుండా పునరావృతమవుతున్నందున కార్యాలయ రికార్డులు, విధుల సమయాలు, సంబంధిత ఉద్యోగుల వాంగ్మూలాలు, అందుబాటులో ఉన్న కమ్యూనికేషన్ వివరాలను పరిశీలించి సమగ్ర విచారణ జరపాలని ఉద్యోగ వర్గాలు కోరుతున్నాయి. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారికి కూడా తన వాదన వినిపించే అవకాశం కల్పించాలని వారు పేర్కొంటున్నారు.

ఫిర్యాదు ప్రతులను వైస్‌చాన్స్‌లర్ కార్యాలయం, మహిళా సెల్, యూనివర్సిటీ ఉద్యోగ సంఘాలకు కూడా అందజేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో యూనివర్సిటీ ఉన్నతాధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి ఆరోపణలు నిజమని తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రేమ పెళ్లి....పగతో విచ్చిన్నం!!

- పన్నెండేళ్ళ కాపురంలో మనస్పర్థల చిచ్చు
- అమ్మాయి తల్లిదండ్రుల ఇంటిని తగలబెట్టిన దుండగులు
- అత్తపై అల్లుడి దాడితో తీవ్ర గాయాలు
- దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్







**అక్షరశక్తి,ప్రధాన ప్రతినిధి:** వారు ఇద్దరూ ఒకరికి ఒకరు ఇష్టపడి ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు. అంతా సవ్యంగానే ఉంది అనుకునే సమయానికి ఆ కుటుంబంలో కలతలు రేగాయి. పెద్దల సమక్షంలో ఎన్ని తీర్మానాలు చేసినా అబ్బాయి వేధింపులు ఆగలేదని తెలిసింది. ఈ క్రమంలో విడాకులు మాత్రం పరిష్కారం అని పెద్దలు తీర్మానించారు. పన్నెండేళ్లకే వారి కాపురానికి ముగింపు పలకాలని ఇరువురు అనుకున్నారు. కానీ ఇక్కడే అసలు వివాదం మొదలైంది. విడాకులకు ముందే పిల్లల పోషణకు ఆస్తి రాసివ్వాలి అని అనుకున్న తరువాత గొడవలు తీవ్ర రూపం దాల్చి, హత్యాయత్నానికి కూడా దారి తీసింది.

**ప్రేమపెళ్లి విచ్చిన్నం...**

కమలాపూర్ మండలం అంబాల గ్రామానికి చెందిన కృష్ణకాంత్, ఆత్మకూరు మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన అనిత ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వారికి ఒక బాబు, పాప కూడా ఉన్నారు. పెళ్లి అయిన నాలుగు సంవత్సరాల నుండే అత్తింటి వారి నుండి వేధింపులు ఎక్కువ అయ్యాయని అమ్మాయి కుటుంబం ఆరోపిస్తున్నది. 12 ఏళ్ల కాపురంలో పలు మార్లు పెద్దలతో పంచాయతీ కూడా నిర్వహించారు. పలు మార్లు గొడవలు తీవ్ర రూపం దాల్చడంతో పెద్దల సమక్షంలో విడాకులు తీసుకోవాలని నిర్ణయించారు. పిల్లల భవిష్యత్తు కోసం అంబాలలో ఉన్న ఇల్లు రాస్తానని ఒప్పుకున్న తరువాత గొడవలు తీవ్ర రూపం దాల్చాయి.

**అత్తపై అల్లుడి దాడి...**

కమలాపూర్ మండలం అంబాలకు చెందిన అనిత, కృష్ణ కాంత్ దంపతుల మధ్య కొన్నాళ్లుగా గొడవలవుతు న్నాయి. ఈనేపథ్యంలో మంగళవారం అనిత తండ్రి రవి, తల్లి స్వరూప, సోదరుడు రాజు కలిసి అంబాల లోని కృష్ణకాంత్ ఇంటికి వచ్చి అతడిపై, అతడి కుటుంబ సభ్యులతో వాగ్వాదానికి దిగారని పోలీసులు తెలిపారు. అనంతరం కృష్ణకాంత్ కోపంతో అత్త స్వరూపను కారుతో ఢీకొట్టడంతో ఆమె తీవ్రగాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ నేపథ్యంలో తమపై బండ రాయితో దాడి చేశారని కృష్ణకాంత్ తల్లి జ్యోతిర్మయి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అనితతో పాటు ఆమె తల్లి, తండ్రి, సోదరుడిపై దాడి కేసు నమోదు చేసినట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు. కాగా, అంబాల లోని తన ఇంట్లో తాను ఒంటరిగా ఉన్న సమయంలో తన
భర్త కుటుంబ సభ్యులు కలిసి మూకుమ్మడిగా తనపై, తన కుటుంబీకులపై దాడి చేశారని, చంపుదామనే ఉద్దేశంతో తన భర్త.. తన తల్లి స్వరూపను కారుతో ఢీకొట్టాడని అనిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనితో కృష్ణకాంత్ పై హత్యాయత్నం కేసు, అతడి కుటుంబీకులపై దాడి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హరికృష్ణ తెలిపారు.

**ఇల్లు దహనం...**

ఇది ఇలా ఉండగా అమ్మాయి కుటుంబానికి చెందిన ఇంటిని నిన్న గుర్తు తెలియని వ్యక్తులు తగులబెట్టారు. తన తల్లి తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో ఉండగా మా ఇంటిని తగల బెట్టారని కుమారుడు ఆత్మకూరు పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు. కృష్ణకాంత్ కుటుంబ సభ్యులే ఈ ఘాతుకానికి పాల్పడ్డారని, మా అమ్మను కూడా చంపడానికి ప్రయత్నం చేశారని వారిపై కఠిన చర్యలు చేసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం.

### జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో వనమహోత్సవం.



**అక్షరశక్తి వరంగల్:** మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం... అనే లక్ష్యంతో ముందుకు సాగాలని ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని విద్యార్థుకు విద్యతో పాటు పర్యావరణం మీద అవగాహన కల్పించాలని కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంతచార్యులు గడ్డం భాస్కర్ అన్నారు. ఈ మేరకు గురువారం వరంగల్ హంటర్రోడ్లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో వనమహోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా పీఠం పీఠాధిపతి ఆచార్య గడ్డం వెంకన్న ఆధ్వర్యంలో జరిగిన వనమహోత్సవం కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంతచార్యులు గడ్డం భాస్కర్ , ప్రముఖ పర్యావరణవేత్త తాళ్లపల్లి రామస్వామి గౌడ్ పాల్గొని పీఠానికి పలు రకాల పండ్లు, పూల మొక్కలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన పరిసరాలలో మొక్కలు నాటడం వల్ల పర్యావరణం కాపాడుకోవడమే కాక భవిష్యత్ తరాలకు ప్రాణవాయువును అందించినట్లేనని అన్నారు. ఈ సందర్భంగా పీఠం పరిసరాలలో విద్యార్థులు, పీఠం సిబ్బంది మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ అమేర్ ఆలీఖాన్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీమంతుల దామోదర్, డాక్టర్ చూరేపల్లి రవికుమార్, డాక్టర్ బాసాని సురేష్, టెక్నికల్ అసిస్టెంట్ డాక్టర్ గంపా సతీష్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలి



**అక్షరశక్తి, హనుమకొండ క్రైమ్:** వరంగల్ ట్రైసిటీ పరిధిలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ సూచించారు. గురువారం ఆమె ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ వెంకన్న, ఎన్‌హెచ్ఏఐ పీడీ భరద్వాజ్‌తో పాటు పోలీస్, ట్రాఫిక్, మున్సిపల్, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు పాల్గొన్నారు. నగరంలోని బ్లాక్‌స్పాట్లను గుర్తించి ప్రమాదాల నివారణకు చర్యలు, ట్రాఫిక్ సిగ్నళ్ల ఏర్పాటు, రోడ్లపై ఆక్రమణల తొలగింపు, పార్కింగ్ స్థలాల ఏర్పాటు, రోడ్డు మరమ్మతులు, యూటర్న్‌ల వద్ద సోలార్ బ్లింకర్ల ఏర్పాటు, ఆటో స్టాండ్లకు అనువైన ప్రాంతాల గుర్తింపుపై చర్చించారు. ట్రైసిటీ పరిధిలో రాత్రివేళ వెలుతురు సరిగా లేని 159 ప్రాంతాలను గుర్తించినట్లు కమిషనర్ ఎన్. శ్వేత తెలిపారు. ఆయా ప్రాంతాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాలు, ప్రధాన కూడళ్లు, రోడ్డు మలుపులు, అనధికార పార్కింగ్ ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీస్, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిశీలించాలని మున్సిపల్ కమిషనర్ వెంకన్న పేర్కొన్నారు. సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత, హనుమకొండ ఏసీపీ నర్సింరావు, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణతో పాటు ట్రాఫిక్ విభాగం అధికారులు, ఇన్‌స్పెక్టర్లు, ఐటీ కోర్, టి.టి.ఐ అధికారులు పాల్గొన్నారు.



# సుష్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం!





- రాజకీయంగా బాధ్యత వహించాలనడం సరికాదు
- నన్ను బాధ్యురాలిగా చేయడం సహజ న్యాయ స్ఫూర్తికి విరుద్ధం
- పార్టీ క్రమశిక్షణా నియమావళిపై సంపూర్ణ గౌరవం ఉంది
- నాకు జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలి
- టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి కొండా సురేఖ లేఖ

**అక్షరశక్తి, హైదరాబాద్ :** తన కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగతమని తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. గురువారం టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి ఆమె లేఖ రాశారు. ఈ సందర్భంగా తన కుమార్తె చేసిన వ్యాఖ్యలపై ఆ లేఖలో మంత్రి కొండా సురేఖ వివరణ ఇచ్చారు. తన కుమార్తె అయినంత మాత్రాన.. ఆమె వ్యక్తిగత అభిప్రాయాలకు మరొకరు రాజకీయంగా బాధ్యత వహించాలనడం సముచితం కాదని స్పష్టం చేశారు. సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిగా చేయడం సహజ న్యాయ స్ఫూర్తికి విరుద్ధమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై, పార్టీ క్రమశిక్షణా నియమావళిపై తనకు సంపూర్ణ గౌరవం ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలు, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఈ అంశంలో తన ప్రమేయం లేదని గుర్తించాలని కమిటీకి ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో తనకు జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని ఈ సందర్భంగా క్రమశిక్షణా కమిటీని మంత్రి కొండా సురేఖ కోరారు.

వరంగల్ జిల్లా గీసుకొండలో బుధవారం మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలను ఆమె అభిమానులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె కుమార్తె సుస్మితా పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుస్మిత మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో పరకాల నుంచి తాను బరిలో దిగుతానని ప్రకటించారు. పార్టీ అధిష్ఠానం తనకు టికెట్ ఇవ్వకున్నా.. ఇండిపెండెంట్‌గా బరిలో దిగుతానని వెల్లడించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిపై ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. సుస్మిత వ్యాఖ్యలు మీడియా, సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో సుస్మితా పటేల్ వ్యాఖ్యలపై పార్టీ అధిష్ఠానం సీరియస్ అయింది. పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్.. ఈ అంశంపై నివేదిక ఇవ్వాలని పీసీసీని కోరింది. అలాగే క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి కూడా స్పందించారు. దీనిపై మంత్రి కొండా సురేఖను వివరణ కోరతామని అన్నారు. ఈ నేపథ్యంలో గురువారం క్రమశిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ లేఖ రాశారు.

## రామప్ప లో వేగంగా పర్యాటక వసతులు

- ఇంటర్ ప్రిటేషన్ పనులను పరిశీలించిన టూరిజం డైరెక్టర్ రంజిత్ నాయక్



**అక్షరశక్తి,ములుగు:** మండలంలోని పాలంపేట గ్రామంలో గల రామప్ప దేవాలయ తూర్పు ముఖ ద్వారం వద్ద నిర్మిస్తున్న ప్రసాద్ స్కీం లోని ఇంటర్ప్రిటేషన్ ఓ పెన్ థియేటర్, తథితర పనులను గురువారం టూరిజం డైరెక్టర్ రంజిత్ నాయక్ పరిశీలించారు ఇంటర్ప్రటేషన్ సెంటర్ కు సందర్శించిన ఆయనకు జిల్లా పర్యాటకశాఖ అధికారి ఎం శివాజీ డి ఈ నటరాజ్ ఏఈ విజయకుమార్ లు పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రసాద్, సాస్కి పథకంలో జరుగుతున్న పనులను పరిశీలించి ఏ పనులు ఎంతవరకు పూర్తి చేశారని పూర్తి పనులు ఎప్పటిలాగా పుర్తి చేస్తారని పూర్తయిన తర్వాత భవిష్యత్తులో వీటిని పర్యాటకలకు ఏ విధంగా ఉపయోగపడతాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పనులను నాణ్యతతో త్వరలో పూర్తి చేయాలని పర్యాటకులకు అందుబాటులో తీసుకురావలని అధికారులకు సూచించారు. అనంతరం లక్నవరం, ఘనపురం కోటగుల్ల వద్ద జరుగుతున్న పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. వారి వెంట ఏఈ కీర్తి, లోకేష్, టూరిజం గైడ్స్ గోరంట్ల విజయ్ కుమార్, వెంకటేష్, సిబ్బంది, టూరిస్ట్ పోలిసులు, టూరిజం కార్పొరేషన్, బోటింగ్ సిబ్బంది, తధితరులు ఉన్నారు.



# ఊకల్ పెట్రోల్ బంకులో దొంగతనం..

## ముగ్గురు అరెస్ట్

**అక్షరశక్తి,గీసుగొండ:** ఊకల్ గ్రామ శివారులో వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారిపై ఉన్న భారత్ పెట్రోల్ బంకులో దొంగతనానికి పాల్పడిన ముగ్గురు నిందితులను గీసుగొండ పోలీసులు అరెస్ట్ చేశారు. కాజీపేటకు చెందిన కంది చరణ్, జక్కుల ప్రతాప్, గండికోట శివలు ఈ నెల 18న అర్ధరాత్రి పెట్రోల్ బంకుకు వెళ్లి, అక్కడి మేనేజర్ వద్ద రెక్కీ నిర్వహించారు. అనంతరం మేనేజర్ నిద్రిస్తున్న సమయంలో ఆయన బ్యాగులోని రూ.15,800 నగదును దొంగిలించి ఆటోలో పరారయ్యారు. కేసు దర్యాప్తులో భాగంగా క్రైమ్ సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు. గురువారం మరియాపురం శివారులో కెనాల్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఆటోను ఆపి తనిఖీ చేయగా, ముగ్గురు నిందితులు పట్టుబడ్డారు. విచారణలో పెట్రోల్ బంకులో దొంగతనం చేసినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. వారి నుంచి రూ.11 వేల నగదు, రెండు మొబైల్ ఫోన్లు, దొంగతనానికి ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు తరలించి, వారిపై సస్పెక్ట్ షీట్లు తెరవనున్నట్లు పోలీసులు తెలిపారు. కేసును త్వరితగతిన ఛేదించిన ఎస్ఐ అనిల్ కుమార్, కానిస్టేబుళ్లు అరవింద్, విజయ్, ప్రవీణ్, సాయిలను గీసుగొండ సీఐ విశ్వేశ్వర్ అభినందించారు.



GUEST COLUMN

# బీసీఐ చైర్మన్ అతి జోక్యం

## తన చర్యలకు బాధ్యత వహించి రాజీనామా చేయాలి

ఆగస్టు 13న బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) చైర్మన్, అదే సమయంలో బీజేపీ ఎంపీగా ఉన్న మానన్ కుమార్ మిశ్రా జారీ చేసిన ఒక నియంత్రణ ఉత్తర్వు రాజ్యాంగాన్ని ఉల్లంఘించింది. నిర్దోషులను శిక్షించటానికి పూనుకుంది. ప్రజల ఒత్తిడి నేపథ్యంలో కొన్ని గంటల్లోనే ఆ ఉత్తర్వును వెనక్కి తీసుకున్నారు. ఇది కేవలం ఇబ్బందికరమైన ఘటన కాదు. ఇది ఒక రాజ్యాంగ సంక్షోభం. దీనికి బాధ్యుడైన వ్యక్తి జవాబుదారీగా ఉండాలి.

ఆగస్టు 13 ఉదయం మానన్ కుమార్ మిశ్రా బీసీఐ చరిత్రలోనే అత్యంత రాజ్యాంగ విరుద్ధమైన ఆదేశాన్ని జారీ చేశారు. అదే రోజు సాయంత్రానికి ఆయన సొంత కౌన్సిల్ ఆ ఉత్తర్వును తిరస్కరించింది. ఉత్తర్వులో మార్పులు చేశారు, శిక్షాత్మక అంశాలను తొలగించారు. 2026లో నల్సార్ నుంచి పట్టభద్రులైన విద్యార్థులు స్వేచ్ఛగా న్యాయవాదులుగా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ వెనక్కి తగ్గడాన్ని గొప్ప ఔదార్యంగా చూపించారు. కానీ అసలు ప్రశ్నలు మాత్రం మారలేదు. మొదట ఆ ఉత్తర్వు ఎందుకు జారీ చేయబడింది? దాన్ని జారీ చేసే అధికారం ఆయనకు ఉందా? ఇంతకాలం న్యాయవాద వృత్తిలో ఉండి, బీసీఐకి సుదీర్ఘ కాలం అధ్యక్షుడుగా ఉన్న వ్యక్తికి ఇలాంటి ఆదేశాలు జారీ చేసే చట్టబద్ధమైన అధికారం లేదనే విషయం తెలియదా? ఇవన్నీ ఇప్పటికీ సమాధానం కోరుతున్న ప్రశ్నలే. కొన్ని గంటల్లోనే వెనక్కి తగ్గాల్సి రావడం అసలు ఉత్తర్వు ఎంత అన్యాయమైనదో మరింత స్పష్టంగా చూపిస్తోంది. తాను ఇంకా బీజేపీ కార్యకర్తగానే విధేయత చూపించారు. కానీ ఒక ప్రతిష్ట కలిగిన బీసీఐ అధ్యక్షుడు అనే హుందాతనాన్ని మరచి మానన్ కుమార్ మిశ్రా అహంకారంతో వ్యవహరించారు.

**మిశ్రా ఆ ఉత్తర్వుతో ఏం చేయాలనుకున్నారు?**

ఆగస్టు 13 ఉదయం మిశ్రా ఒక ఆదేశం జారీ చేశారు. నల్సార్ 2026 బ్యాచ్‌లోని ఒక్క విద్యార్థిని కూడా తదుపరి ఆదేశాలు వచ్చే వరకు న్యాయవాదిగా నమోదు చేయకూడదని అందులో పేర్కొన్నారు. అంతేకాదు, నల్సార్ వైస్ ఛాన్సలర్‌కు మూడు రోజుల గడువు ఇచ్చి, విద్యార్థులు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు లేదా "బయటి వ్యక్తులు" ఎవరెవరు ఈ లేఖ వ్యవహారాన్ని ప్రారంభించారో, ఈ ఉత్తరాన్ని ఎవరు తయారు చేశారో, అందులోని విషయాలను ఎవరు ప్రచారం చేశారో, ఎవరు మీడియాతో మాట్లాడారో లేదా తాను చెప్పినట్లు "వ్యవస్థీకృత ప్రచారం" నిర్వహించారో వారి వివరాలను ఇవ్వాలని ఆదేశించారు.

**దీనికి కారణం ఏమిటి?**

సుమారు 450 మంది విద్యార్థులు తమ విశ్వవిద్యాలయానికి ఒక లేఖ రాశారు. కాన్వకేషన్‌కు భారత ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ సూర్యకాంత్‌ను యూనివర్సిటీ కాన్వకేషన్‌కు ముఖ్య అతిథిగా ఆహ్వానించాలన్న నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని వారు కోరారు.

**దీనికి నేపథ్యం ఏమిటి?**

నీట్ పరీక్షా పేపర్ల లీక్ విషయంలో కాక్రోచ్ జనతాపార్టీ ఇచ్చిన పిలుపు మేరకు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మాన్ ప్రసాద్ రాజీనామా చేయాలని కోరుతూ శాంతియుతంగా ప్రదర్శన చేస్తున్న విద్యార్థులపై, యువతీ యువకులపై లాఠీచార్జి, బాష్పవాయువు ప్రయోగం, పెల్లెట్ గన్స్ వాడకం వల్ల గాయపడిన వారి విషయంలో సుప్రీంకోర్టులో అత్యవసర పిటిషన్‌పై పోలీసుల దౌర్జన్యానికి సంబంధించిన వీడియోలను న్యాయవాదులు చూపించేందుకు ప్రయత్నించినప్పుడు, చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా (సీజేఐ) "మాకు ఆ వీడియోలపై ఆసక్తి లేదు. వాటిని చూసే సమయం లేదు. మా సమయాన్ని వృథా చేయకండి, మీ సమయాన్ని కూడా వృథా చేసుకోకండి" అని చెప్పినట్లు సమాచారం.

దానిపై విద్యార్థులు బాధ పడుతూ తమ లా కాలేజీ వైస్ ఛాన్సలర్‌కు రాసిన లేఖలో "సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను తమ కాన్వకేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆహ్వానించే విషయంలో నిర్ణయం తీసుకునే ముందు పునరాలోచన చేయాలని కోరుతూ మర్యాదపూర్వకంగానే విజ్ఞప్తి చేస్తున్నాం" అని పేర్కొన్నారు. అందులోని విషయాలు రాజ్యాంగ విలువల ఆధారంగా ఉన్నాయి. ఈ విషయంలో ఎలాంటి ఆందోళన లేదా అంతరాయం కలిగించబోమని కూడా విద్యార్థులు స్పష్టంగా పేర్కొన్నారు. తమ సొంత విశ్వవిద్యాలయానికే వారు ఆ లేఖలు రాశారు. అంటే, ఒక స్వేచ్ఛాయుత న్యాయ విద్య అందించాల్సిన విద్యార్థుల్లో ఉండాల్సిన ప్రజాస్వామ్య ఆలోచనలకు అవి ఉదాహరణలు. కానీ మిశ్రా స్పందన మాత్రం దాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై తిరుగుబాటుగా పరిగణించినట్టుగా ఉంది.

**కొన్ని గంటల్లోనే వెనక్కి తీసుకున్న ఉత్తర్వు**

ఆగస్టు 13 సాయంత్రానికి బీసీఐ అత్యవసర సమావేశం నిర్వహించి చైర్మన్ ఇచ్చిన ఉత్తర్వును ఏకగ్రీవంగా సవరించింది. సవరించిన ప్రకటనలో, "నల్సార్ 2026లో పట్టభద్రులైన విద్యార్థుల్లో అత్యధికులు నిర్దోషులు" అని పేర్కొన్నారు. అందువల్ల 2026లో పట్టభద్రులైన విద్యార్థులందరూ రాష్ట్ర బార్ కౌన్సిళ్లలో న్యాయవాదులుగా నమోదు చేసుకోవడానికి అనుమతించారు. తర్వాత మిశ్రా సామాజిక మాధ్యమం ఎక్స్‌లో బీసీఐ "ఈ వ్యవహారంపై విచారణను పూర్తిగా ముగించాలని నిర్ణయించింది" అని ప్రకటించారు.

**ఇక్కడే దీన్ని జాగ్రత్తగా గమనించాలి**

మిశ్రా నేతృత్వంలోని బీసీఐనే కొన్ని గంటల్లో ఆయన ఉదయం ఇచ్చిన ఉత్తర్వులోని ప్రధాన భావన తప్పు అని ఏకగ్రీవంగా నిర్ధారించింది. ఇది సాధారణ సంస్థాగత సవరణ కాదు. ఒక చైర్మన్ తనంతట తానే తీసుకున్న నిర్ణయాన్ని అదే రోజు తన సొంత కౌన్సిల్ ఏకగ్రీవంగా వెనక్కి తీసుకున్న ఘటన. అందుకే సహజంగానే ఒక ప్రశ్న తలెత్తుతోంది. అసలు మిశ్రా ఆ ఉత్తర్వు జారీ చేయడానికి ఆయనకున్న అధికారం ఎక్కడిది? అసలు అధికారమే లేనప్పుడు ఈ పాకులాట దేనికి? ఎవరి మెప్పుకోసం? అడ్వకేట్స్ యాక్ట్, 1961 ప్రకారం న్యాయ విద్య, వృత్తిపరమైన ప్రమాణాల విషయంలో బీసీఐకి విస్తృత అధికారాలు ఉన్నాయి. అంతేకానీ, కౌన్సిల్ తీర్మానం లేకుండా చైర్మన్ ఒంటరిగా ఒక మొత్తం బ్యాచ్ విద్యార్థుల న్యాయవాదులుగా తమ పేర్లను నమోదు చేసుకోవడాన్ని నిలిపివేసే అధికారం ఆయనకు ఎక్కడా ఇవ్వలేదు.

**చైర్మన్ అంటే బీసీఐ కాదు - బీసీఐ అంటే కౌన్సిల్**

బీసీఐ, బార్ కౌన్సిల్ ఆఫ్ కేరళ సభ్యుడు అడ్వకేట్ ఎన్. మనోజ్ కుమార్ ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పారు. విద్యార్థులందరి నమోదును నిలిపివేసే ఆదేశం "స్పష్టంగా ఏకపక్షమైనది", అది పట్టభద్రుల రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనకు దారితీస్తుందని, "అత్యంత అనవసరమైన చర్య" అని ఆయన పేర్కొన్నారు. బీసీఐ న్యాయవ్యవస్థను సంతృప్తిపరిచేలా కనిపించే చర్యలకు దూరంగా ఉండాలని, న్యాయవాదుల హక్కులు, ప్రత్యేక హక్కులు, ప్రయోజనాలను రక్షించడం, బార్ స్వతంత్రతను, గౌరవాన్ని కాపాడటంపై దృష్టి పెట్టాలని ఆయన గుర్తు చేశారు.

**జోడు పదవుల సమస్య**

ఈ రాజ్యాంగపరమైన సమస్యను మానన్ కుమార్ మిశ్రా ఒకేసారి నిర్వహిస్తున్న రెండు పదవులను పరిగణనలోకి తీసుకోకుండా అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. ఆయన ఒకవైపు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ —— దేశంలోని న్యాయవాదుల వృత్తికి అత్యున్నత చట్టబద్ధ నియంత్రణ సంస్థకు అధిపతి. మరోవైపు ఆయన అధికారంలో ఉన్న బీజేపీకి చెందిన ఎంపీ. ఒక పరిపక్వ ప్రజాస్వామ్యంలో ఇలాంటి జంట పాత్రలను సాధారణంగా నిషేధించాలి లేదా కనీసం కఠినమైన ప్రయోజనాల సంఘర్షణ వచ్చినప్పుడు స్వయంగా తప్పుకునే నిబంధనలు ఉండాలి. నల్సార్ విద్యార్థులు ప్రస్తుత ప్రభుత్వంతో సంబంధాల విషయంలో రాజకీయంగా ప్రాధాన్యత కలిగిన ఒక రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తిని తమ స్నాతకోత్సవానికి ఆహ్వానించడాన్ని పునఃపరిశీలించాలని తమ విశ్వవిద్యాలయాన్ని కోరారు. దానికి ప్రతిస్పందనగా బీసీఐ చైర్మన్, అదే సమయంలో అధికార పార్టీ ఎంపీగా ఉన్న వ్యక్తి, ఆ విద్యార్థులను వారి వృత్తిలోకి ప్రవేశించకుండా అడ్డుకునే చర్యకు దిగారు.

అలాంటి పరిస్థితిలో న్యాయ వృత్తి నియంత్రణ సంస్థ స్వతంత్రంగా ఉందని నమ్మడం కష్టమవుతుంది. ఇక్కడ అసలు ప్రశ్న మిశ్రా ఉద్దేశపూర్వకంగా విద్యార్థులకు చెడు చేయాలనుకున్నారా లేదా అన్నది కాదు. అధికార పార్టీకి చెందిన ఒక ఎంపీ దేశంలోని న్యాయవాదుల అత్యున్నత నియంత్రణ సంస్థకు అధిపతిగా కొనసాగుతున్న వ్యవస్థను నిజంగా స్వతంత్ర వ్యవస్థగా పరిగణించగలమా? అన్నదే అసలు ప్రశ్న.

**ఆయనను చైర్మన్ పదవి నుంచి తొలగించాలా? లేక సిగ్గుతో తానే తప్పుకుంటారా?**

మిశ్రా ప్రవర్తన బీసీఐ చైర్మన్ పదవి నుంచి ఆయన తొలగింపునకు కారణమవుతుందా అనే చర్చ ఇప్పుడు బార్ కౌన్సిల్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు, న్యాయ విద్యావేత్తల మధ్య ప్రారంభమైంది. అడ్వకేట్స్ యాక్ట్, బీసీఐ నిబంధనల ప్రకారం చైర్మన్ కౌన్సిల్‌కు జవాబుదారీగా ఉంటారు. తన వ్యక్తిగత అధికార పరిమితులను దాటి, మొత్తం విద్యార్థుల బ్యాచ్‌పై ప్రభావం చూపే ఉత్తర్వును ఏకపక్షంగా జారీ చేసి, కొన్ని గంటల్లోనే అదే కౌన్సిల్ చేత ఏకగ్రీవంగా వెనక్కి తీసుకునే పరిస్థితి ఏర్పడటం సామూహిక పాలనకు సంబంధించిన ప్రాథమిక నిబంధనల ఉల్లంఘనగా పరిగణించవచ్చు. అంతేకాక, విద్యార్థుల రాజ్యాంగ హక్కుల విషయంలో భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, ఆర్టికల్ 19(1)(ఎ), ఆర్టికల్ 19(1)(జి)లకు సంబంధించిన తీవ్రమైన ప్రశ్నలను కూడా ఈ చర్య లేవనెత్తుతోంది.

మిశ్రా వెనక్కి తగ్గిన ప్రకటనలో "కొంతమంది అధ్యాపకులు, బయటి వ్యక్తులు అమాయక విద్యార్థులను ప్రేరేపించారు" అనే భావన కూడా ముఖ్యమైనది. దీని ద్వారా బీసీఐ అసలు ఉత్తర్వును వెనక్కి తీసుకున్నప్పటికీ, విచారణ కొనసాగుతోందనే భావనను కొనసాగించేందుకు ప్రయత్నించినట్టుగా కనిపిస్తోంది. అలాగే ఎలాంటి స్పష్టమైన ప్రక్రియ లేకుండా కొంతమంది అధ్యాపకులపై అనుమానాన్ని కొనసాగించింది. ఇది సూత్రబద్ధమైన పునరాలోచన కాదు. అసలు తప్పు నుంచి బయటపడేందుకు రూపొందించిన ఒక ఎత్తుగడలా కనిపిస్తోంది. అదే సమయంలో మరో రాజ్యాంగ సమస్యకు కూడా అవకాశం కల్పిస్తోంది.

**అసలు ఇప్పుడు ఏం చేయాలి?**

ఒక సక్రమంగా పనిచేసే ప్రజాస్వామ్య న్యాయ సంస్థలో ఆగస్టు 13న జరిగిన ఘటన తర్వాత నల్సార్ విద్యార్థులపై కాకుండా బీసీఐ చైర్మన్‌పై అధికారిక విచారణ ప్రారంభం కావాలి. కౌన్సిల్ కొన్ని ప్రశ్నలకు సమాధానాలు కోరాలి. చైర్మన్ ఏ వ్యక్తిగత అధికారంతో ఆ ఉత్తర్వును జారీ చేశారు? ఆ ఉత్తర్వు విద్యార్థుల రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించిందా? చైర్మన్ అధికార పార్టీకి చెందిన ఎంపీగా ఉండటం ఈ నిర్ణయంలో ఏమైనా ప్రభావం చూపిందా? ఇలాంటి ప్రశ్నలను అత్యవసరంగా అడగాల్సిన అవసరం ఉంది. కానీ, ఉత్తర్వును వెనక్కి తీసుకోవడంతో వ్యవస్థ మొత్తం ఈ ఘటనను మరచిపోవడానికి అవకాశం లభించింది. కొన్ని గంటలపాటు తమ వృత్తి జీవితాన్ని నిలిపివేసిన చట్టపరమైన ఆధారం లేని ఏకపక్ష ఉత్తర్వుకు గురైన నల్సార్ విద్యార్థులు కేవలం నిశ్శబ్దంగా ఆ ఉత్తర్వు వెనక్కి తీసుకోవడాన్ని మాత్రమే అంగీకరించాల్సిన అవసరం లేదు. వారికి క్షమాపణ చెప్పాలి. వారి హక్కులు ఉల్లంఘించబడ్డాయని అధికారికంగా అంగీకరించాలి. భవిష్యత్తులో ఇలాంటి ఘటన మళ్లీ జరగకుండా సంస్థాగత హామీ ఇవ్వాలి.

**వ్యంగ్యం ఏమిటంటే ఇదే**

నల్సార్ విద్యార్థులు రాజ్యాంగ నియమాలనే పాటించారు. సహజ న్యాయం గురించి చదివారు. ఏ అధికారం కూడా రాజ్యాంగం కంటే పై స్థాయిలో ఉండదని వారికి బోధించారు. వారు అదే విద్యను తమ జీవితంలో అమలు చేశారు. తమ విశ్వవిద్యాలయానికి ఒక మర్యాదపూర్వక లేఖ రాశారు. కానీ వారి విద్య, వృత్తి జీవితాన్ని కాపాడాల్సిన సంస్థే వారి వృత్తి భవిష్యత్తును నాశనం చేసే స్థాయిలో వారిపై చర్య తీసుకోవడానికి ప్రయత్నించింది. బీసీఐ విధిలేని పరిస్థితుల్లో చివరకు వెనక్కి తగ్గింది.

మిశ్రా కూడా వేరే గత్యంతరం లేక వెనక్కి తగ్గారు. విద్యార్థులకు మళ్లీ న్యాయవాదులుగా నమోదు చేసుకునే అవకాశం లభించింది. కానీ ఒక మొత్తం తరం విద్యార్థుల గొంతును ఒక పని రోజు పాటు అణచివేయడానికి ప్రయత్నించిన నియంత్రణ సంస్థలో ఎలాంటి సంస్కరణ జరగలేదు. కేవలం ఇబ్బందికరమైన పరిస్థితి ఏర్పడింది. జవాబుదారీతనం లేని ఇబ్బందికరమైన పరిస్థితి సంస్కరణ కాదు. అది మళ్లీ అదే విధమైన చర్యలు తీసుకుంటే అందుకు ఒక ముందస్తు హెచ్చరిక మాత్రమే.



- డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
ramkishore.1504@gmail.com

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.